కథానిక

# వెన్నెల

"కిరణ్"

కాశ్మీరు పర్యటన ముగించుకొని తిరిగివస్తూన్న రాగిణక్కయ్య రాక కోసం యెదురు చూస్తోంది మంజుల. రాగిణీవాళ్ళ కుటుంబమంతా కాశ్మీరుకు బయల్దేరి అప్పటికి సరిగా అయిదువారాలు గడచిపోయాయి. ఏదో వ్యాపారపు గొడవల్లో తనభర్త ఢిల్లీకి వెళుతూంటే తను ఒక్కర్తే, మంజూదగ్గర కొద్ది రోజులు గడిపిపోదామని రాగిణి తిన్నగా బొంబాయికి వస్తూంది.

బాగా చీకటి పడుతోంది. మసక మసగ్గా, బెడ్ లైటు నీలి నీడలు ప్రాకుతూన్న గదిలో పరధ్యానంగా కూర్చొని, చప్పుడైనప్పుడల్లా కళ్ళెత్తిచూస్తూ, ఏదో పుస్తకం చదువుకొంటూ వుంది.

వాకిట్లో చప్పుడైంది. ప్రయాణపు దుస్తులతో రాగిణి ప్రత్యక్షమైంది. పరామర్శించుకోనైనా లేదు. ఇద్దరి శరీరాలు గాఢ పరిరంభాలలో వెచ్చనయ్యాయి. ఆ తర్వాతనే ఒకరి యోగక్షేమాలొకరు విచారించుకొన్నారు. వాళ్ళవాళ్ళ కుటుంబాల మంచీ, చెడ్డా మాట్లాడుకొన్నారు ఎన్నెన్నో విషయాలు ముచ్చటించుకొన్నారు. కేరింతలు కొట్టుకొన్నారు. నవ్వుకొన్నారు. అస్పష్ట వాక్యాలతో పసిపాపల్లాగా ఆడుతూ పాడుతూ ఏమిటేమిటో మాట్లాడుకొన్నారు రాగిణి తన ప్రయాణపు దుస్తులు మార్చి వేరే వాటిని కట్టుకొంటోంది.

మంజు పెద్ద దీపంకోసం కేకేసింది దీపం రాగానే రాగిణి ముఖంలోకి పరకాయించి చూచి నివ్వెరపోయింది అయిదువారాల క్రిందట ఎంతో ఉత్సాహంగా కళకళలాడుతూన్న రాగిణి ముఖం వాడిపోయి, కన్నులు లోనికి పీల్చుకొనిపోయాయి. నిగనిగలాడుతూ మృదుకపోలాలమీద వ్రాలి ఆమె ముఖ లావణ్యానికి క్రొత్త సొబగులు సంతరిస్తూండిన నల్లని ముంగురులు, తెల్లబడి రెండు వెండి పాయలుగా చీలి, ఆమె రెండు చెంపలను తాకుతున్నాయి.

పాతికేండ్ల వయస్సుకూడా సరిగా నిండకపోయినా, ఆమెలో ఈ ఆకస్మికపరివర్తన, కాశ్మీరుకు పోయాకనే కలిగింది.

విభ్రమంతో, నిర్విణ్ణురాలైపోయి నిల్చింది మంజు రాగిణివేపు చూస్తూ. ఏదో భయంకరమైన విపత్తు సంభవించి ఉంటుందనుకొంది. కనుగొలకులలో నీళ్లు నిండాయి.

"రాగూ! ఏంజరిగిందేమిటి?" అంది ఎంతో ఔత్సుక్యంతో.

భారంగా, ఉద్విగ్నంగా ఉంది రాగిణి. వ్యథితహృదయపు తెచ్చికోలు నవ్వుతో "భయపడకు చెల్లీ. మరేం ప్రమాదం లేదు... ఏమిటి? అలా చూస్తున్నావ్? నా తెల్లబడ్డ ముంగురులనేనా?"

కాని మంజూ యిదేమీ వినిపించుకోలేదు. రాగిణి చెప్పిన సమాధానాలకు తృప్తిపడలేదు. బలంగా రాగిణి భుజాల పట్టుకొని ఊపుతో ఆమెముఖంలో ముఖంపెట్టి పరీక్షగా చూస్తూ "చెప్పు! అక్కాయి! ఏంజరిగిందో చెప్పు. అబద్ధం చెప్పావంటే నేనిట్టే పసిపట్టేయగలను సుమా!" అంది.

ఒకరి ముఖం ఒకరు చూస్తూ నిర్లిప్తంగా నిల్చుండిపోయారు. సొమ్మసిలి పోతుందేమోననిపించేటట్లు పాలిపోయింది రాగిణి ముఖం. వ్రాలిపోతూన్న కనకొనలలో రెండు కన్నీటిబొట్లు తళతళ మెరిసిపోయాయి.

మంజూ ప్రశ్నలవర్షం కురిపిస్తూనే ఉంది. మెల్లగా మందగించిన స్వరంతో "ఒకర్ని ప్రేమించాను చెల్లీ" అని గొణిగింది. అంతే. ఇక మాట్లాడలేకపోయింది. మంజూ కౌగిటిలో తలదాచుకొని ఏడ్చింది.

క్రమంగా స్థిమితపడి, గుండెల అదటు

తర్వాత, మంజూ కౌగిలిని సడలించుకొంది. తన లోని తీవ్రబాధని, ఒక సానుభూతి గల హృదయానికి చెప్పుకొని ఉపశాంతిని పొందాలనుకొంది.

అక్కా చెల్లెళ్లు, చీకటిలో ఓమూల ఉన్న సోఫాలో చేరగిలబడ్డారు. అక్కయ్య భుజం మీద చేయివేసి, దగ్గరకు లాక్కొని, హృదయంలో హృదయం ఉంచి శ్రద్ధగా వింటోంది మంజూ, రాగిణక్కయ్య చెప్పేది.

"నిజంలో, నాకేం కారణం కనిపించటం లేదు. అసలు నా బ్రతుకే నాకు అర్థం కావటంలేదు. కాని ఆ రోజునుంచి నేను పూర్తిగా వెర్రెత్తి పోయాను. చెల్లీ! ఇకనుంచి నీవేనా జాగ్రత్త పడు. బ్రతుకు మెత్తగా హాయిగా ఉంటుందనిపించే, ఆ ఒక్క మధుర క్షణానికి గుండెలు చీల్చుకొని, ఆకులపాటు కలిగించి, మనస్సును మత్తులో ముంచెత్తే, ఆ అనుభూతులకూ, చేతులు చాచి మనసారా ప్రేమించి, గాఢ కౌగిళ్ళలో సొక్కిపోవాలనే ఆ తీవ్రమైన కోర్కెలకూ ఎంత సులభంగా లొంగి పోతామో తెలుసుకొన్నామంటే, మనమెంత బలహీనులమో నీకే అర్థమౌతుంది.

"నీకూ తెలుసు నా భర్తని. నేనెలా అతన్ని ప్రేమించేదాన్నో. బుద్ధి పరిపక్వం చెందిన వాడే. సున్నితమైన మనస్సు కలవాడే. కాని ఏం లాభం? సున్నితమైన ఆడదాని మనస్సు పోకడలను గ్రహించలేక పోయేవాడు. స్త్రీ హృదయం అర్థం చేసుకోలేక పోయేవాడు. ఎప్పుడూ ఎంతో దయగా, చిరునవ్వు నవ్వుతూ నిష్కళంక హృదయంతో అమాయకంగా ఉండేవాడు. అతడి కనులలో ఎప్పుడూ జాలి తొణికిసలాడుతూండేది. అతడు ఎప్పుడూ అలాగే ఉండేవాడు. నీవునమ్ముతావో నమ్మవో కాని నేనొక్కపరి అనుకునేదాన్ని, అతడు దృఢమైన తన బాహువులలో నన్ను మిద్చుకొని తీయగా ముద్దెట్టుకొంటే ఎంతో బావుండునని, మా యిద్దరి శరీరాలు ఏకమై అవ్యక్తమైన వలపు వాంఛలులాగా ఉండిపోవాలని. చివరకు ఒకొక్క అప్పుడు అనుకొనేదాన్ని, అతడు పూర్తిగా అశక్తుడై నన్నూ, నా పరిచర్యలను గ్రహించే అవసరంవస్తే ఎంతో బావుంటుందని.

"ఇదంతా నీకు వెర్రిగా కనిపిస్తుంది. కాని మన ఆడజాతి స్వభావమే అంత. మనం ఎంత యత్నించినా, ఈ సహజత్వానికి అతీతులం కాలేము. నాకెప్పుడూ అతడికి ద్రోహం చేద్దామనే తలంపేలేదు. కాని ఆరోజు అదలా జరిగిపోయింది. నాకు తెలీకుండానే జరిగిపోయింది. ఎందుకూ? ఆ ఒక్కరాత్రి పసిడి వెన్నెలలు సెలయేటి నీటి తరంగాలపైన చలించి మత్తుగా నవ్వుకొంటున్నందుకు.

"మా ప్రయాణపు రోజులలో నాభర్త మూకీభావం, నా ఉత్సాహాన్ని, నా ఆనందాన్ని త్రాళ్లతో బిగించి కట్టేసినట్లనిపించింది. నాలో రేకెత్తే కవితా భావనలను అరికట్టేసింది.

"పసిడికిరణాలతో స్వాగతమిచ్చే సూర్యుణ్ణి చూస్తూ కొండ దిగుతూంటే, పొగమంచు గుండా కనిపించే, ఆ అగాథమైన లోయలూ, ఇరువేపులా నీలాల శిఖరాలు, పచ్చని పైర్లూ, పైర్లమీదనుంచీ రెపరెపలాడతూ వచ్చే పిల్లగాలి కెరటాలూ, మెలికలు తిరుగుతూ ప్రవహించే సెలయేళ్ళూ, అనంతాకాశంలో తేలిపోయే మబ్బు తునకలూ, బొమ్మరిండ్లలాగా కనిపించే గ్రామాలూ, ఓహ్! ఏం చెప్పేది. మనస్సుకు యెంతో హాయిగా ఉండేది. ఎక్కడో అమృత స్రోతస్సులలో తేలిపోతూన్నట్లు ఉండేది. అలాగే ఆ కొండల్లో విశృంఖలంగా పావురాయి జంటలాగా బ్రతుకునే కవిత్వంగా పాడుకొంటూ ఎగిరిపోవా లనిపించింది. ఆనందంతో ఒళ్లు పులకరించింది. నాభర్త చేతులు నా చేతుల్లోకి తీసుకొంటూ,

"ఎంత బావుందండీ! ఈ దృశ్యం" అన్నా సాభిప్రాయంగా నాభర్త ముఖంలోకి చూస్తూ. ఆ మధుక్షణంలో అతడి నోటినుంచి మధురాతి మధురమైన సమాధానమే వస్తుందని ఆశించా. కాని... కాని మృత్యుశైత్యాన్ని మరిపించేటట్లు అన్నాడు "పడే బాగానే ఉంది, నన్నేం చేయమంటావు" అని. నా నరనరాల్లోని రక్తం గడ్డకట్టిపోయింది. హతాశనైపోయాను. నిజంలో ప్రేమికులు, ఇలాంటి రసార్ద్రమైన ప్రకృతి దృశ్యాలు చూచినప్పుడు చలిస్తారూ, గాఢంగా ప్రేమించుకొంటారు.

"కాని... ఏం చెప్పేది? నాలో పొంగులు

పారుతున్న కవితా తరంగాలు ఆ సమయంలో అణగారిపోయాయి.

"నా శరీరం ఆవిరితో నింపిన యంత్రంలాగా ఉండిపోయింది.

"ఆ రోజు సాయంత్రమే అనుకొంటాను, నా భర్త తలనొప్పిగా ఉందని, లాడ్జిదగ్గరే ఉండిపోయాడు. భోజనా లయాక నేను మాత్రం ఒంటరిగా బయలుదేరాను ప్రక్కనే ఉన్న సరోవరం ఒడ్డుకే షికారుకు.

"కాశీ మజిలీ కథలాంటి ఆ రాత్రి మనస్సుకెంతో ఉల్లాసం కలిగిస్తోంది. నీలాకాశం మధ్యలో పున్నమ చంద్రుడు నవ్వుకొంటున్నాడు. ఎత్తయిన ఆ కొండల మంచు శిఖరాలను చూస్తూంటే వెండి కిరీటాలు పెట్టుకొన్నట్లుగా ఉన్నాయి. ఆ సరస్సు నీళ్లలో పసిడి వెన్నెలలు పడినపుడు, గాలికి నీళ్ళు చలించి తళతళ కదిలిపోతున్నాయి. శరీరానికి మత్తు కలిగిస్తూ, బరువుగా, మెత్తగా చిరుగాలి కెరటాలు వీస్తున్నాయి. అలాంటి సమయంలో మనస్సు ఎంతో చురుగ్గా, వేగంగా పనిచేస్తుంది. ముందుకు ఉరకలు వేస్తుంది. మనస్సులోని ఉద్రేకాలు పెనవైచుకొని బలిసిపోతాయి.

"నేను అలాగే ఆ పచ్చికమీద నిశ్శబ్దతరంగాలతో, గాంభీర్యంగా, హృదయాలను ఆకట్టే ఆ సరస్సును చూస్తూ కూర్చున్నాను. నాలో ఏదో విచిత్ర భావన బయల్దేరింది. నా విషాద జీవితాన్ని ఎదిరించే విప్లవం చెలరేగింది. నా జీవితానికి యిలాంటి వెన్నెల రాత్రులలో యిలాంటి సరస్సు ఒడ్డున నేను ప్రేమించిన యువకుడి కౌగిటిలో ఉండిపోయే అదృష్టం లేదా! జీవన మాధుర్యాన్ని గ్రహించే నోము నోచుకోలేదా? వెన్నెలలు విరిసిపోతూన్న యిలాంటి శారద రాత్రులలో ప్రేమంటే, ప్రేమించుకోవటమంటే ఏమిటో తెలుసుకొనే భాగ్యంకూడా లేదా! ఆ రోజు ఎందుకో, నా మనసు యిలాంటి వెర్రి మొర్రి ఊహాలతో ఉద్రిక్తపడసాగింది. హేతువాదం నశించిన అబలలా ఏడ్చాను.

"వెనుక ఎవరో కదలిన శబ్దమైంది. ఎవరో నావేపే తదేక దీక్షతో చూస్తూన్నట్లనిపించింది. వెనుదిరిగి చూశాను. అతడు నన్ను గుర్తుపట్టినట్టున్నాడు. నన్ను సమీపిస్తూ "మీరు ఏడుస్తున్నారా" అన్నాడు ఓదార్పుగా.

"మాతోటే అతడూ వాళ్ల తల్లితో ప్రయాణం చేస్తున్నాడు. ఎక్కడో ప్లీడరట. ఎప్పుడూ అతడి కళ్లు నన్ను వెంటాడుతూ ఉండేవి.

"అతడలా అనగానే నాకేం సమాధానం చెప్పాలో తోచలేదు. అసలు ఆ పరిస్థితిలో ఏం చేయాలో కూడా తోచలేదు. ఒళ్లు అస్వస్థతగా ఉందన్నాను. అతడు నా ప్రక్కగానే సహజరీతిలో మర్యాద తెలిసిన వాడిలాగానే నడుస్తున్నాడు. మా ప్రయాణంలో చూసిన వాటి నన్నిటిని గురించి చెప్పటం ప్రారంభించాడు. అంత క్రితం నా మనస్సులో కలిగిన మధుర సంచలనాన్ని మాటలలోకి అనువదించాడు. ఎలా చెబితే నా మనస్సు పులకిస్తుందో, అతడు నాకంటే బాగా తెలుసుకొన్నాడు. ఉన్నట్లుండి ఉమర్ ఖయ్యాం "రుబాయతు"లోని కొన్ని పద్యాలు చదివాడు. ఏదో చెప్పలేని ఆవేశంతో ఉక్కిరిబిక్కిరైపోయాను.

"చుట్టూ ఉన్న ఆ నీలాల శిఖరాలు, ఆ విశాల సరోవరం ఆ వెన్నెల ఏవో తెలియని తీయందనాలను గురించి పాడుకొంటున్నాయి.

"ఆరోజు అది అలా జరిగిపోయింది.ఎందుకు జరిగిందో, ఎలా జరిగిందో ఇప్పటికీ నాకు తెలియదు. కాని ఏదో మతిభ్రమణంలో జరిగినట్టుగా ఉంది. అతడు మరల నాకు కనిపించలేదు. అతడి చిరునామా మాత్రం ఇచ్చి పోయాడు" ఇకమాట్లాడలేక రాగిణి చెల్లెలి కౌగిటిలో తలదాచుకొని వెక్కి వెక్కి ఏడవటం మొదలెట్టింది.

మంజుల తమాయించుకొని, తెచ్చిపెట్టుకొన్న గాంభీర్యంతో అంది.

"అసలు సాధారణంగా మనం ప్రేమించేది పురుషుణ్ణి కాదు — ప్రేమనే. ఆ రాత్రి నీ నిజ ప్రియుడు వెన్నెలే" అని.

(మూలం : మొపాసా)